# తీర్పు

నిరంజన్

కోర్టు హాలు లాయర్లతోనూ, ప్రేక్షకుల తోనూ క్రిక్కిరిసి వుంది గుసగుసలు రణగొణ ధ్వని చెలరేగుతున్నాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిఫెన్స్‌లాయరు, మిగతా అందరూ జడ్జీగారి రాకకు ఎదురు చూస్తు న్నారు గోడగడియారం పదకొండు గంటలు కొట్టింది.

జడ్జి ధర్మరాజు కోర్టులోకి ప్రవేశిం చారు డవాలు బంట్రోతు కర్ర సుత్తితో టేబుల్ మీద కొడుతూ "ఆర్డర్ ఆర్డర్" అన్నాడు. కోర్టు హాలును నిశ్శబ్దత ఆవరించింది.

ఇద్దరు పోలీసులు వెంటరాగా ముద్దాయి రాజశేఖరం బోనులోకి ప్రవేశించాడు. అతని వయస్సు ముప్ఫయి సంవత్సరా లుంటుంది. సన్నటి మనిషి కోలముఖం చప్పదవడలు దట్టంగా పెరిగిన గెడ్డం. చెదిరిన క్రాపు. నలిగిన దుస్తులు నిరాశా, నిస్పృహలు గూడుకట్టుకున్న కళ్ళు. దైన్యత నిండిన ముఖం. రాజశేఖరాన్ని చూసిన ఎవరైనా అతను హత్య చేశా డంటే నమ్మలేరు.

రాజశేఖరం మీద అతను తన భార్య రాధను హత్య చేశాడనే అభియోగం మోపబడింది ప్రత్యక్షసాక్ష్యాలు లేక పోయినా, హేతువాదం, సర్కమ్‌స్టాన్షి యల్ ఎవిడెన్స్ దృష్ట్యా. రాజశేఖరం, రాధను హత్యచేశాడని వెనుకటి దినం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించి నిరూ పించారు. కానీ హతురాలు రాధ శవం మాత్రం దొరకలేదు

"మిస్టర్ రావ్! యుకెన్ ప్రొసీడ్." అన్నారు ధర్మరాజు డిఫెన్స్ లాయరు రంగారావు వంకచూస్తూ

రంగారావు కుర్చీలోంచి లేచాడు జడ్జి వంక చూసి చిన్నగా నవ్వాడు. వారిరు వురూ లయన్స్ క్లబ్‌లో మెంబర్లు. తరచు కలుసుకునే వారు. రంగారావు క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచినవ్యక్తి. ఇంతవరకూ తను చేపట్టిన ఏ కేసులోనూ అపజయం అన్నది ఎరుగడతను అతని ప్రజ్ఞా పటిమలు, వాదన సాటిలేనివి. ధర్మ రాజుకు, రంగారావంటే ఒక ప్రత్యేకాభి మానం

రంగారావు తన నల్లగౌను సవరించు కున్నాడు. ముద్దాయివంక, జూరీ సభ్యుల వంక, ప్రేక్షకులవంక పరిశీలనగా చూశాడు గొంతు సరిచేసుకుని తన వాదన ప్రారంభించాడు

"మైలార్డ్! అండ్ ది జంటిల్‌మెన్ ఆఫ్ జ్యూరీ! ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు మరుగు పరచిన కొన్ని ముఖ్యాంశా లను కోర్టువారికి మనవిచేస్తాను ముద్దాయి రాజశేఖరం ఈ నగరంలోని గౌరవనీయ

వ్యక్తులలో ఒకరు. ఆస్తి, అంతస్తు, ఐశ్వర్యము, హోదా కలవారు. సభ్యత, సంస్కారము తెలిసిన వారు. ఉన్నత సాంప్రదాయ కుటుంబంలో పుట్టినవారు. చదువుకున్నవారు. రాజశేఖరం, శ్రీమతి రాధను ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వారి దాంపత్యం అన్యోన్యమైనది. అనురాగంతో నిండినది. వారి మధ్య పొరపొచ్చాలు, అరమరికలు లేవు. ఈ విషయాలన్నిటికి ప్రత్యక్ష సాక్ష్యాధారాలు వున్నాయి. కాకపోతే చిన్నచిన్న మనస్పర్ధలన్నవి ప్రతి కుటుంబంలోనూ సహజం. ఆ సమయంలో పరస్పరం దూషించుకోవటం పరిపాటి. అలాంటి సంఘటనలను ఆధారం చేసుకుని—రాజశేఖరం తన భార్య శీలాన్ని శంకించి ఆమెను హత్య చేశాడనటం అసమంజసం. అసంబద్ధం. పైగా రాజశేఖరం ఈ హత్య చేస్తుండగా చూసిన వ్యక్తులు లేరు. అన్నిటిని మించి శ్రీమతి రాధ శవం ఇంత వరకూ దొరకలేదు. ఒకవ్యక్తి, కొన్ని రోజులుగా కనిపించనంత మాత్రాన—ఆ వ్యక్తి హత్య చెయ్యబడ్డట్టు భావించటం మిక్కిలి హాస్యాస్పదం. నిజం చెప్పాలంటే— శ్రీమతి రాధ అసలు మరణించనేలేదు... ఆమె బ్రతికేవుంది " అని ఆగి, డ్రమెటిక్‌గా కోర్టు గుమ్మంవైపు చూశాడు రంగారావు.

"యువర్ ఆనర్! రాధ సజీవంగా వుంది. కోర్టులోకి ప్రవేశించటానికి మీ అనుమతికై గుమ్మం వద్ద వేచి వుంది. చూడండి యువరానర్ . చూడండి ." అంటూ గుమ్మం వైపు వేలుపెట్టి చూపించాడు.

ధర్మరాజు, జూరీ సభ్యులు, లాయర్లు, ప్రేక్షకులు కోర్టు గుమ్మంవైపు ఆత్రంగా చూశారు. కానీ అక్కడెవరూ లేరు. డిఫెన్స్‌లాయరు ఏ ప్రయోజనం ఆశించి ఆ అబద్ధం ఆడాడో, ఎవరికీ అర్థంకాలేదు.

ధర్మరాజు రంగారావు ముఖంలోకి చూశారు.రంగారావు గంభీరంగా నవ్వాడు.

"మైలార్డ్! ఈ కోర్టులోని వారందరూ శ్రీమతి రాధ—మరణించలేదని, సజీవంగా వుందని భావిస్తున్నారు. అందుకే ఆమె గుమ్మంవద్ద వుందనగానే, అందరూ అటువైపు చూశారు. ఈ విషయం కోర్టు వారి దృష్టికి తేవాలనే— నేనీ అబద్ధం ఆడాను. ముద్దాయి రాజశేఖరం అమాయకుడని, నిరపరాధి అని అందరూ భావిస్తున్నారు. అందుకని 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' మీద ముద్దాయి రాజశేఖరాన్ని నిర్దోషిగా భావించి విడుదల చేయవలసిందిగా కోరుతున్నాను " అంటూ తన వాదాన్ని ముగించి కుర్చీలో కూర్చున్నాడు రంగారావు.

ధర్మరాజు జూరీ సభ్యులవంకచూశారు. వారు పరస్పర సంప్రదింపుల అనంతరం "రాజశేఖరం నిరపరాధి అని మేము భావిస్తున్నాము .." అని తమ ఏకగ్రీవాభిప్రాయాన్ని తెలియజేశారు. కోర్టుహాలులోని ప్రేక్షకులు తీర్పు వినటానికి ఆత్రంగా ఎదురు చూడసాగారు. ముద్దాయి విడుదల చేయబడతాడని చాలామంది భావించారు.

"ముద్దాయి రాజశేఖరం తన భార్య శ్రీమతి రాధను హత్య చేశాడని నమ్ముతూ అతన్ని నేరస్థుడిగా భావిస్తూ ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 ప్రకారం ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష

విధిస్తున్నాను...." అంటూ తన తీర్పు తెలియజేశారు ధర్మరాజు.

ధర్మరాజు తీర్పు రాజశేఖరాన్ని, జూరీ సభ్యులను, లాయర్లను, ప్రేక్షకులను, రంగారావును ఆశ్చర్యాంబుధిలో ముంచెత్తింది. ధర్మరాజు ఏ కారణంగా రాజశేఖరం రాధను హత్యచేశాడనే నిర్ణయానికి వచ్చాడో ఎవరికీ అర్థంకాలేదు.

జడ్జి నిష్క్రమించారు. ప్రాసిక్యూటర్ విజయగర్వంతో తన జూనియర్లతో కోర్టు బయటకు వెళ్ళాడు. ప్రేక్షకులు తలో రకంగా మాట్లాడుకుంటూ బయటకు నడచారు. కోర్టు హాలు నెమ్మది-నెమ్మదిగా ఖాళీ అవసాగింది.

రంగారావు కారు పార్క్ వద్దకు వచ్చాడు. ధర్మరాజు తనకారులో కూర్చొని యింటికి వెళ్ళటానికి సిద్ధంగా వున్నాడు.

ధర్మరాజు కారువద్దకు వెళ్ళాడు రంగారావు.

"సార్! .మీ తీర్పు సమంజసంగా లేదు" అన్నాడు రంగారావు నిష్ఠూరంగా.

"ఏం? .ఎందుకు? " ప్రశ్నించాడు ధర్మరాజు.

"రాధ-కోర్టు గుమ్మంవద్ద వుందని నేనన్నప్పుడు కోర్టులోని ప్రతి ఒక్కరూ అటువైపు చూశారు. వారంతా రాధ మరణించలేదని సజీవంగా వుందని భావించారు. రాజశేఖరం నిరాపరాధి అని నమ్మారు. అలాంటప్పుడు మీరు మాత్రం అతనే ఈ హత్య చేశాడనే నిర్ణయానికి ఎందు కొచ్చారు?"

"అవును. నిజమే. కోర్టులోని ప్రతి వ్యక్తి రాధ మరణించ లేదనే భావనతోనే మీ మాటలు విని గుమ్మం వంక చూశారు. అందరూ రాజశేఖరం నిర్దోషి అని నమ్మారు. కాదనను. కానీ రాజశేఖరం మాత్రం వంచిన తల ఎత్తలేదు. గుమ్మం వైపు చూడలేదు. అతనికి ఆ అవసరం కలుగలేదు. అతనికి రాధ మరణించిందని దృఢంగా తెలుసు. కారణం అతను రాధను హత్యచేశాడు...." గంభీరంగా నవ్వుతూ అన్నారు ధర్మరాజు.

ధర్మరాజు మాటల్లోని నగ్న సత్యాన్ని కాదనే ధైర్యం లేకపోయింది రంగారావుకు. అపజయం ఎరుగని లాయరు రంగారావుకు ధర్మరాజు 'తీర్పు'తో అంగీకరించక తప్పలేదు. ***

